ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | 5





ఏదో.. ఫీలింగ్!



నేడు ప్రేమికుల దినోత్సవం 6

అనంతమైన ఆనందం.. అంతకుమించిన మాధుర్యం.. జీవితమంత అమృతం.. గుప్పెడంత గుండెలో ప్రమాణం.. కంటికి కనిపించని భావన.. అదొక అంతులేని కావ్యం.. రాయలేనన్ని అనుభవాల ప్రవాహం.. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఆ రెండు అక్షరాల్లో ఇముడ్చుకొని విశ్వాన్ని ఏలుతోంది. అదే.. ప్రేమ. రెండు మనసులను ఒక్క క్షణంలో కలిపి ఏడుడగులు వేయించి జీవితమంతా ఒకరికొకరు తోడూనీడగా నడిపించే మహత్తర శక్తి ఈ ప్రేమ. దాని గురించి నిర్వచనం చెప్పాలంటే అనిర్వచనీయమే. ఏదో తెలియని ఫీలింగ్.. ఫీలింగ్. ప్రేమకోసం అందరూ పరితపిస్తారు. దానికోసం ప్రాణానికికన్నా మిన్నగా పోరాడతారు. కానీ కొందరే ప్రేమను జయిస్తారు. నిజానికి ప్రేమ కథలంటే అందరికీ ఇష్టమే. ఈ ప్రేమికుల దినోత్సవాన కొన్ని ప్రేమ కథలను మీరూ చదివేయండి మరి!





వైభవంగా నరసన్న తెప్పోత్సవం, పుష్పోత్సవం





గురువారం రాత్రి జరిగిన స్వామి వారి పుష్పోత్సవం.. (పైన) తెప్పోత్సవ దృశ్యం

ముగిసిన అంతర్వేది కల్యాణ ఉత్సవాలు 6



ఇంకా 'సిట్' అవదా..

- కాకినాడలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అతీగతీలేని సిట్
- ప్రత్యేక సిట్ బృందాన్ని నియమించి రెండు నెలలు దాటినా విచారణ ఏదీ
- దర్యాప్తు అసలు ఎప్పుడు మొదలవుతుందో కూడా తెలియని పరిస్థితి
- గతేడాది నవంబరు నెలాఖరులో స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం
- అప్పట్లో కొద్దిరోజులపాటు రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై అట్టుడికిన కాకినాడ
- డిసెంబర్ 6న సిట్ నియమించిన తర్వాత నుంచీ నెమ్మదించిన చర్యలు
- మరోపక్క సిట్ దర్యాప్తు మొదలవకపోవడంతో రేషన్ మాఫియాలో దర్జా
- తమకేం కాదనే ధోరణిలో మళ్లీ మొదలైన రేషన్ బియ్యం కొనుగోళ్లు

కాకినాడ కేంద్రంగా కొనసాగిన వందల కోట్ల రేషన్ బియ్యం మాఫియాపై సిట్ దర్యాప్తునకు అతీగతీ లేకుండాపోతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి నెలలకు నెలలు గడుస్తున్నా అసలు విచారణ ఊసే లేదు. ఈనేపథ్యంలో అసలు రేషన్ మాఫియాపై సిట్ రంగంలోకి దిగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ నుంచి రూ.8 వేల కోట్లకుపైగా విలువైన బియ్యం నౌకల్లో విదేశాలకు ఎగుమతైంది. ఇందులో సగాని కిపైగా రేషన్ బియ్యమే. అయితే స్టెల్లా నౌకలో గతేడాది నవంబరులో రేషన్ బియ్యం పట్టుబడ్డ నేపథ్యంలో వేళ్లూనుకుపోయిన మాఫియా బట్టబయలైంది. దీంతో రేషన్ స్మగ్లింగ్ గుట్టు తేల్చ డానికి ప్రభుత్వం డిసెంబరు 6న సిట్‌ను నియమించింది. ఇది జరిగి రెండు నెలలకుపైగానే దాటిపోయినా సిట్ విచారణకు అసలు దిక్కులేకుండా పోయింది. అప్పట్లో నౌకలో రేషన్ బియ్యాన్ని పట్టుకోవడానికి డిప్యూటీ సీఎం పవన్ రావడం, షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. తీరా విచారణ ఊసే లేకపోవడంతో అక్రమార్కులు మళ్లీ చెలరేగిపోతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని వైసీపీ అక్రమార్కులు చెరబట్టేసి గడచిన అయిదేళ్లలో భారీగా విదేశాలకు తరలించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా రహస్య నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసి రేషన్ బియ్యం పేదలకు ఇలా అందగానే.. అలా కిలోకు రూ.10 చెల్లించి లక్షల టన్నులు కాకినాడకు తరలించడమే పనిగా పెట్టుకున్నారు. ప్రధానంగా వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు బియ్యాన్ని కనివినీ ఎరుగని రీతిలో బొక్కేశారు. పౌరసరఫరాలశాఖ పరిధిలోని రేషన్ బియ్యం వ్యవస్థను కుళ్లబొడిచేశారు. ప్రభుత్వం వందలకోట్లు సబ్సిడీ చెల్లించి పేదలకు ఇచ్చే బియ్యాన్ని సదరు నేత, ఆయన మనుషులు కారుచౌకగా కొట్టేసి దాన్ని సార్టెక్స్ యంత్రాల్లో పాలిష్‌చేసి ఆకర్షణీయ ప్యాకింగ్‌ల్లో ఉంచి నౌకల ద్వారా ఆఫ్రికా దేశాలకు అమ్మేసుకుని వేలకోట్లు గడించారు. ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-2020లో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి 19 లక్షల మెట్రిక్ టన్నులు, 2020-21లో 27 లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 29లక్షల మెట్రిక్ టన్నులు, 2022-23లో 38లక్షల మెట్రిక్ టన్నులు, 2023-24లో 24లక్షల మెట్రిక్ టన్నులు తరలిపోయింది. ఇందులో రేషన్ బియ్యం సగానికిపైనే. అయితే గతేడాది నవంబరు ఆఖరులో కాకినాడ నుంచి పశ్చిమ ఆఫ్రికాదేశానికి స్టెల్లానౌకలో రహస్యంగా ఎగుమతికి సిద్ధంచేసిన రేషన్ బియ్యం పట్టుబడడంతో స్మగ్లింగ్ వ్యవహారం అధికారికంగా బయటకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడకు వచ్చి స్వయంగా షిప్ వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రేషన్ ఆనవాళ్ల కోసం వెదికితే కాకినాడ, చుట్టుపక్క ప్రాంతాల్లో అనేక గోదాముల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుబడింది. ఈనేపథ్యంలో వేళ్లూనుకుపోయిన రేషన్ బియ్యం స్మగ్లింగ్‌పై రాష్ట్రప్రభుత్వం గతేడాది డిసెంబరులో ఉక్కుపాదం మోపింది. మాఫియాను అంతమొందించి అక్రమార్కులను శిక్షించే విధంగా ప్రత్యేకంగా సిట్‌ను నియమించింది. రేషన్ బియ్యం కాకినాడకు నలుమూలల నుంచి ఎలా చేరుకుంటోంది? ఎవరు తరలిస్తున్నారు? ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? అక్కడి నుంచి ఏయే గోదాముల నుంచి మిల్లులకు వెళ్లి పాలిష్ చేసుకుని ఏయే కంపెనీల ద్వారా నౌకల్లో విదేశాలకు తరలిపోనున్నాయనేదానిపై ఈ సిట్ బృందం దర్యాప్తు చేపడుతుందని పేర్కొంది. ఈ క్రమంలో దర్యాప్తులో భాగంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేసే అధికారం సైతం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే కాకినాడ, చుట్టుపక్కల మొత్తం అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలో గతేడాది జూన్, జూలై నెలల్లో 13 రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిపై కూలంకుషంగా దర్యాప్తుచేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే సిట్ బృందాన్ని నియమించిన నేపథ్యంలో అయిదు పోలీసుస్టేషన్ల పరిధిలోని 13 కేసులపై జిల్లా పోలీసులు సైతం లోతుగా విచారణ చేశారు. సిట్ దర్యాప్తునకు వస్తే తక్షణ నివేదిక ఇచ్చేలా వివరాలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాకినాడ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జులై 11న రూ.26కోట్లు, జూన్ 28న కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప స్టేషన్ పరిధిలో రూ.13.96 కోట్ల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. ఇది లవన్ కంపెనీదిగా గుర్తించారు. కొటారి అమిత్‌కుమార్ అనే వ్యాపారిని నిందితుడిగా తేల్చారు. అయితే ఇదే లవన్ కంపెనీ పశ్చిమ ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి చేస్తుండగా బార్జిలో 1,060 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంతో పట్టుబడింది. అదేరోజు కరప స్టేషన్ పరిధిలో రూ.15.31 కోట్ల బియ్యం పట్టుబడింది. ఇది ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన వినోద్ అగర్వాల్‌కు చెందిన సరళ ఫుడ్స్ కంపెనీ. ఇలా సిట్ దర్యాప్తు చేయనున్న ఈ 13 కేసులకు సంబంధించి మొత్తం రూ.84.87 కోట్ల విలువైన 22,947 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో ద్వారంపూడి అనుచరులే అధికంగా ఉండడం గమనార్హం. అయితే క్షేత్రస్థాయిలో పక్కా ఆధారాలు భారీగా ఉండడంతో ఆయా కంపెనీలకు పోలీసులు నోటీసులు కూడా పంపించారు. అయితే సిట్ దర్యాప్తు ప్రారంభిస్తే ఈ కేసుల ఆధారంగా నిందితులను తక్షణం అరెస్ట్ చేయడంతోపాటు వాటి వెనుక ఉన్న పెద్దతలలు సైతం సులువుగా దొరికే అవకాశం ఉంది. కానీ సిట్ రంగంలోకి దిగలేదు.

అక్రమార్కుల్లో ఎంచక్కా దర్జా..

రేషన్ స్మగ్లింగ్‌పై ఏకంగా సిట్ విచారణకు ఆదేశించడంతో బియ్యం అక్రమార్కులు వణికిపోయారు. పైగా సిట్‌కు అరెస్ట్‌ల అధికారం కట్టబెట్టడంతో తమ పాపం పండినట్లేనని భయపడ్డారు. ఇంతవరకు దాని ఊసే లేకపోవడంతో తమకేం కాదులే అనే ధోరణిలో ప్రస్తుతం మళ్లీ రేషన్ బియ్యం కొనుగోళ్లు మొదలుపెట్టారు. వాస్తవానికి సిట్‌ను నియమించిన తర్వాత అందులో ఉన్న కొందరు సభ్యులు గత వైసీపీ ప్రభుత్వానికి అడ్డంగా కొమ్ముకాసిన వారేనన్న విమర్శలు వచ్చాయి. దీంతో వీరిని మార్చి ప్రభుత్వం డిసెంబరు 27న మరో కొత్త సిట్‌ను నియమించింది. అందులో కొందరు పోలీసులను తప్పించి కాకినాడ జిల్లాలో బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతిని నియమించారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. అటు కొత్త సిట్‌లో సభ్యులుగా ఉన్న ఇద్దరు ఉమ్మడి జిల్లా అధికారుల్లోను అయోమయం కొనసాగుతోంది. తమను దర్యాప్తు బృందంలో సభ్యులుగా చేర్చినా విచారణకు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో వారు అయోమయంలో కొనసాగుతున్నారు.

జలకళకు నిధులు!



- ఏటిగట్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు రూ.54.57 కోట్లు మంజూరు
- ఓఅండ్‌ఎం పనులకు రూ.70.01 కోట్లతో 953 ప్రతిపాదనలు
- నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 పనుల ఆధునికీకరణ
- రబీకి నీటి ఎద్దడి లేకుండా ప్రయత్నం : ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యమైంది. వేసవిలో కనీసం కాలువల్లో పూడిక కూడా తీయని పరిస్థితి ఉండేది. డెల్టా ఆధునికీకరణ పనులు అసలు పట్టించుకోలేదు. వరదల సమయంలో ఏటిగట్లకు తాత్కాలిక పనులకోసం కూడా నానా ఇబ్బందులుపెట్టేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే వరదగట్ల అభివృద్ధి, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పటిష్టతకు రెండు విడతలుగా రూ.54.57 కోట్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభంకాగా, కొన్ని టెండర్ల దశలోనూ, కొన్ని సాంకేతిక అనుమతుల దశలోనూ ఉన్నాయి. ఇంకా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లతోపాటు గ్రోయిన్లు, డెల్టా ఆధునికీకరణ తదితర పనులకు రూ.257 కోట్ల నాబార్డు నిధులతో 322 పనులు ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించారు. అలాగే కాలువల క్లోజర్ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) పనులు చేయడానికి రూ.70.01 కోట్లతో 953 పనులు ప్రతిపాదించారు. ప్రస్తుత ఇరిగేషన్ పరిస్థితి మీద ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గోపీనాథ్‌తో 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు ప్రస్తావించారు.

● రబీ సాగుకు నీటి లభ్యత ఏంటి..

ఎస్ఈ : ఇబ్బంది ఉండదనే భావిస్తున్నాం. మొత్తం రబీ, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకోసం 84 టీఎంలు అవసరం. ఇప్పటికే 41 టీఎంసీలు వినియోగించారు. ఇంకా మార్చి 31వ తేదీ వరకూ 43 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం సీలేరు నుంచి 7,300 క్యూసెక్కుల నీరొస్తోంది. మొత్తం అక్కడ నుంచి 10 టీఎంసీల నీరు ఇస్తా మనే హామీ ఉంది. పోలవరం స్పిల్‌వే నుంచి 15 టీఎంసీలు వస్తాయి. సెల్ఫ్‌ల్డ్ 2.38 టీఎంసీలు ఉన్నాయి.

● మిగతా నీటికోసం యాక్షన్ ప్లాన్..

ఎస్ఈ : జిల్లా నీటిపారుదల అభివృద్ధి సంస్థ సమీక్ష నాటికి నీరు పుష్కలంగా ఉందనే అంచనాతో యాక్షన్ ప్లాన్ ఏమీ సిద్ధం చేయలేదు. సీలేరులో వాస్తవానికి 67 టీఎంసీల నీరు ఉంది. అవసరమైతే ప్రభుత్వ సహాయంతో మరికొంత తెచ్చే ప్రయత్నం చేస్తాం. నిజంగా శివారు ప్రాంతాల్లో ఎక్కడైనా ఎద్దడి వస్తే అప్పటికపుడు నిర్ణయాలు తీసుకోవడానికి కాకినాడ కలెక్టర్ సుముఖత తెలియజేశారు. మిగతా జిల్లాల కలెక్టర్లకు కూడా పరిస్థితిని వివరించి నీటి ఇంజన్లు ఏర్పాటు, క్రాస్‌బండ్‌ల నిర్మాణం వంటి పనులు చేస్తాం.

● క్లోజర్ సమయంలో కాలువల పనులకు యాక్షన్ ప్లాన్ ఏమైనా ఉందా?

ఎస్ఈ : 953 పనులు చేయడానికి రూ.70.01కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వాటితో ఆపరేషన్, మెయింటెనెన్స్ పనులు చేస్తాం.

● వరదల సమయంలో ఈసారి ముఖ్య పనులు చేసే పరిస్థితి ఏమైనా ఉందా?

ఎస్ఈ : డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల కింద ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు మంజూరుచేశారు. మొదట విడతలో 37.57 కోట్లను 73 పనులు చేయడానికి ఇచ్చారు. వీటితో ఏటిగట్ల పటిష్టత, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల అభివృద్ధి చేయనున్నాం. అంతేకాక పంపా నది స్పిల్‌వే గేట్లు రీప్లేస్‌మెంట్ పనులు కూడా ఉన్నాయి. ఈ పనులకు టెక్నికల్ శాంక్షన్ వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం. కాజ, నర్సాపురం ప్రాంతంలోని కాజ, మడుగుల తూము తదితర ప్రాంతాల్లో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను మరమ్మతులు చేస్తాం. ఇవి టెండర్ల దశలో ఉన్నాయి. ఇటీవల డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద రెండో విడత రూ.17 కోట్లు వచ్చాయి. వాటితో రాజోలు సబ్ డివిజన్‌లో అంతర్వేది పరిధిలోనూ, లూటుకుర్రు, ఆదుర్రు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు మరమ్మతులు చేయవలసి ఉంది. వీటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

● డెల్టా ఆధునికీకరణ పనులేమీ లేవా?

ఎస్ఈ : నాబార్డు నిధులు రూ.257 కోట్లతో 322 ఆధునికీకరణ పనులు చేయడానికి ప్రతిపాదించాం. వీటిలో చాలా అభివృద్ధి పనులను ప్రతిపాదించడం జరిగింది.

● అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న లస్కర్లకు జీతాల సమస్య..

ఎస్ఈ : నిధులు వచ్చాయి. ఈనెలాఖరుకి 2024-25కి సంబంధించిన మొత్తం బకాయిలు చెల్లిస్తాం. ఇక సమస్య ఉండదు.

జిల్లాలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం



మండపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ

- గంజాయి నిరోధానికి ప్రత్యేక బృందాలు
- జిల్లా ఎస్పీ కృష్ణారావు

మండపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లతో పోల్చి చూస్తే ఈ ఏడాది 50శాతం మేర నేరాలు, రోడ్డు ప్రమాదాలు జిల్లాలో తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయించే వారి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. డిజిటల్ అరెస్టు పేరిట వస్తున్న ఫేక్ ఫోన్‌కాల్స్‌కు ప్రజలు మోసపోకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండపేట రూరల్ సీఐ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ తీరు, కేసుల పెండింగ్ అంశాలను ఆయన స్థానిక పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడతూ జిల్లాలో సీసీ కెమెరాలు 800 వరకు ఉన్నాయని మరో 45రోజుల్లో అవసరమైన చోట వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. మండపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొర్రాజు, ఎస్ఐలు బుజ్జిబాబు, సురేష్‌బాబు, హరికోటిశాస్త్రి, రవికుమార్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

- ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సునీత

అమలాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నిక సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కె.సునీత, జిల్లా కలెక్టర్‌లు, ఎస్పీలను ఆదేశించారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయంనుంచి గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సూచనలు చేశారు. కలెక్టరేట్‌నుంచి ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి పాల్గొన్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 64,471మంది ఓటర్లు ఉన్నారన్నారు. 95 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సిబ్బందికి, సూక్ష్మ పరిశీలకులకు మొదటిదశ శిక్షణ ఈనెల 17న, రెండో దశ 20న నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అమలాపురం డివిజన్‌కు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామచంద్రపురం డివిజన్‌కు వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల, కొత్తపేట డివిజన్‌కు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 210 బ్యాలెట్ బాక్సులతోపాటు 10శాతం రిజర్వుతో ఏర్పాటుచేశామన్నారు. బ్యాలెట్ పత్రాలను 5శాతం రిజర్వుడుతో కలిపి 67,725 పత్రాలను సిద్ధం చేశామన్నారు. డీఆర్వో రాజకుమారి, డీటీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంనుంచి గురువారం ఆయన టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, మౌలిక సదుపాయాలు, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 27,313మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 13,431మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 13,881మంది ఉన్నారన్నారు. వీరికోసం జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పేపర్ లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ జరగకుండా గట్టి నిఘా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్సు షాపులను మూసివేయాలన్నారు. త్వరలో మూడు రకాల ప్రశ్నాపత్రాలు, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ జిల్లా కేంద్రమైన అమలాపురం రానున్నాయన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో థియరీ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్ అధికారులను నియమించామన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపులో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కాన్ఫరెన్సులో డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీపీవో వి.శాంతలక్ష్మితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బరిలో 35 మంది

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ 7

కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి 7

- సీఎం చంద్రబాబును కోరిన కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి

ఏ దివిలో మెరిసిన పారిజాతమో...
ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో...
నా మదిలో నీవై నిండిపోయెనే...

హృదయం ఎక్కడున్నది... హృదయం ఎక్కడున్నది...
నీ చుట్టూనే తిరుగుతున్నది...

మనసున ఉన్నది... చెప్పాలనున్నది... మాటలు రావేఎలా...

ఇది చెరగని ప్రేమకు శ్రీకారం...
ఇది మమతల మేడకు ప్రాకారం...

....ఇలా రచయితలెందరో ప్రేమ గురించి వర్ణించారు.

ప్రేమ అంటే... ఏదో తెలియని ఫీలింగ్... రెండక్షరాల ఈ మాట రెండు హృదయాలను ఒక్కటి చేస్తుంది.... ఎక్కడ ఉన్నా పక్కన నువ్వే ఉన్నట్టుంటుందీ... అదేం గారడీ అనుకునే ప్రేమ జీవులు ఎదురుచూసే రోజే వాలెంటైన్స్‌డే.

ప్రేమంటే... రెండు గుండెలు, మూడు ముళ్లు, ఏడు అడుగులు మాత్రమే కాదు. జీవితాంతం ఒకరినొకరు గౌరవించుకుంటూ సాగిపోవడమే అసలైన ప్రేమ.

ప్రేమంటే అనురాగ బంధం.... అనురాగ మంత్రం... అనిర్వచనీయ అనుభూతి... మరపురాని, మరువలేని భావోద్వేగం.... ఇలా ప్రేమకు ఒక్కొక్కరు ఒక్కో నిర్వచనం చెప్తారు.

తొలి చూపులోనే ప్రేమలో పడి పెద్దలను ఒప్పించి పెళ్లి పీటలు ఎక్కిన వారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎందరో ఉన్నారు.

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అందులో కొందరి 'ప్రేమ' ఊసులు...

ఏదో... ఫీలింగ్




సుభాష్-లక్ష్మీసునీత

సీతారాముల కల్యాణంలో ప్రేమకు శ్రీకారం
పెద్దల అంగీకారంతో పరిణయం

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి)

2007లో శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం జరుగుతుండగా ఆలయంలో లక్ష్మీసునీతను చూశాను. తొలిచూపులోనే ఇష్టపడ్డాను. ఆమె గురించి వాకబు చేశాను. నాయనమ్మకు చూపించారు. రెండుసార్లు నా ప్రేమ గురించి చెప్పాను. మౌనమే ఆమె సమాధానం. చివరకు పెద్దల ఇష్టమని చెప్పింది.

నా ప్రేమ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాను. మా తాతగారు అంగీకరించలేదు. లక్ష్మీ సునీతనే వివాహం చేసుకుంటానని పట్టుబట్టాను. మా నాన్నగారు పెద్ద మనసుతో అర్థం చేసుకుని సునీత తల్లిదండ్రులతో మాట్లాడారు. రెండు కుటుంబీకుల అంగీకారంతో ఇద్దరం ఒక్కటయ్యాము.

సునీత జన్మదినం ఏప్రిల్ 19. మా వివాహం 2009 ఏప్రిల్ 19న అమలాపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. మా ప్రేమకు ప్రతిరూపంగా 2018 జూలై 11న సత్యదివిత, సత్యదీక్షిత (కవలలు) జన్మించారు.

వాసంశెట్టి సుభాష్
కార్మిక శాఖ మంత్రి

హాకీ కలిపింది ఇద్దరినీ...


రవిరాజా-నాగమణి

వి.రవిరాజా, ఫిజికల్ డైరెక్టర్

1995లో క్రీడల పట్ల మక్కువతో హాకీ ఆడేందుకు జిల్లా క్రీడా మైదానానికి వెళ్లేవాడిని. ఆ సమయంలోనే హాకీ క్రీడాకారిణిగా వచ్చిన నాగమణిని చూసి ప్రేమలో పడ్డాను. అభిప్రాయాలు దగ్గరగా ఉండడంతో ఇష్టపడ్డాం. ఈ క్రమంలో 1999లో ట్రైనింగ్‌కి వెళ్లి 2002లో పీఈటీలుగా ఉద్యోగాలు సంపాదించాం. ఇద్దరం ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాత తల్లిదండ్రులతో మాట్లాడి 2003లో వివాహం చేసుకున్నాం. ఇద్దరమ్మాయిలు పుట్టారు. పెద్దమ్మాయి ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్, రెండో అమ్మాయి అగ్రికల్చర్ బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ఫిజికల్ డైరెక్టర్లుగా ఇద్దరం ఒకేసారి ఉద్యోగోన్నతి పొందాం. ఇప్పటికీ ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించుకుంటూ ప్రేమను వ్యక్తపరుచుకుంటాం.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)

ప్రైవేటులో ప్రేమ


గెడ్డం ఫిలిప్‌రాజు-లక్ష్మీజ్యోతి

తను మెట్రిక్యులేషన్‌కు, నేను డిగ్రీకి లెక్చరర్ కె.వెంకటేశ్వర్లు వద్ద ఇంగ్లిషు ప్రైవేటుకు వెళ్లేవాళ్లం... అప్పుడే మనసులు కలిశాయి. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 1993లో పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాము. ఆనాటి అన్యోన్యమే నేటికీ కొనసాగుతోంది.

గెడ్డం ఫిలిప్‌రాజు

మలికిపురం (ఆంధ్రజ్యోతి)



ప్రేమికుల రోజున తమ ప్రేయసికి... లేకుంటే ప్రియునికి... మనసులోని భావాలను మధురమైన రూపంలో చెప్పాలని... అందమైన ప్రతిమలుగా అందించాలని తహతహలాడే ప్రేమికుల కోసం దుకాణాల్లో కళ్లు చెదిరే ప్రేమ కానుకలు కొలువుదీరాయి. ప్రేమ చిహ్నామైన హృదయాకారంలో వివిధ ఆకృతుల్లో మదిని దోచేస్తున్నాయి. సుదూర ప్రాంతంలో ఉన్న ప్రేమికులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకునేందుకు ఆన్‌లైన్‌లో బహుమతులు పంపకుంటున్నారు. ఒకే ప్రాంతంలో ఉన్న ప్రియుడు, ప్రియురాలు ఒకరినొకరు సర్‌ప్రైజ్ చేసేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.


కాకినాడ భానుగుడి సెంటర్లోని విక్రయ దుకాణాల్లో బొకేలు, గిఫ్ట్‌లు



అసలు ప్రేమికుల రోజును ప్రపంచమంతా జరుపుకుంటారా? అంటే లేదనే సమాధానం వినిపిస్తోంది. ప్రతిఏటా ఫిబ్రవరి 14న అమెరికా, కెనడా, మెక్సికో, లండన్, ఆస్ట్రేలియా, భారత్, ఇటలీ, డెన్మార్క్, జపాన్‌ల్లో మాత్రమే జరుపుకుంటున్నారు. మూడో శతాబ్దంలో రోమ్ రాజ్యాన్ని క్లాడియస్ అనే చక్రవర్తి పాలిస్తుండేవాడు. సెయింట్ వాలెంటైన్ ఆ రాజ్యంలో ఓ ప్రవక్త. పురుషులు పెళ్లి చేసుకుంటే సైన్యంలో చేరడం తగ్గిపోతుందనే ఉద్దేశంతో పెళ్లిళ్లను క్లాడియస్ రద్దు చేశాడు. అయితే ప్రేమ, పెళ్లి దేవుడికి వ్యతిరేకం కాదని బోధిస్తూ రహస్యంగా ప్రేమికులకు వాలెంటైన్ పెళ్లిళ్లు చేస్తుండేవాడు. ఇది రాజుకు తెలిసి అతడికి మరణశిక్ష విధించాడు. ఫిబ్రవరి 14న దానిని అమలు చేశారు. తన కూతురిని ప్రేమించిన వాలెంటైన్‌ని రాజు ఉరి తీయించాడనే మరో కథనం కూడా ఉంది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కన్నుల్లో నీ రూపమే గుండెల్లో నీ ధ్యానమే


శ్రీనివాస్-కమలకుమారి

మొదటి ప్రేమ అంటే ఇలాగే ఉంటుందని ఆమెను చూసిన తర్వాతే తెలిసింది. 1996లో ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో ఒక అమ్మాయిని చూశాను. తొలి చూపులోనే ఆమెతో (కమలాకుమారి) ప్రేమలో పడ్డాను. ఎవరిని చూసినా ఆమె రూపమే కనిపించేది. ఇరువైపులా తల్లిదండ్రుల సహకారంతో 2005 డిసెంబరు 15న వివాహ బంధంతో ఇద్దరం ఒక్కటయ్యాం. ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. పెళ్లి సమయానికి జాబ్ లేదు. ఇంతలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు (ఆర్టీవో) డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. నా భార్య ఇచ్చిన సపోర్టుతో ఉద్యోగం సంపాదించాను. మా ప్రేమ మొదలై సుమారు 25 సంవత్సరాలైంది. అప్పటికీ, ఇప్పటికీ ఆమెపై నా ప్రేమ అలాగే ఉంది.

బి.శ్రీనివాస్,
మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)

కనులవిందు.. నరసన్న తెప్పోత్సవం

- హంస వాహనంపై విహరించిన నృసింహుడు
- స్వామికి ఘనంగా శ్రీపుష్పోత్సవం
- పవళింపు సేవ.. ముగిసిన తీర్థ మహోత్సవాలు


పుష్పక వాహనంపై విహరిస్తున్న శ్రీలక్ష్మీనరసింహుడు

అంతర్వేది, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం స్వామివారికి పుష్పక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం అప్పనపల్లి వాసి దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు నిర్మించిన పుష్పక వాహనంపై స్వామిని మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగించి ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఏర్పాటుచేసిన చెరువు వద్దకు తీసుకొచ్చారు. తొలుత అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై తెప్పోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నృసింహ నామాలతో జేజేలు పలికారు. బాణసంచా కాల్పులతో కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజవ్వారి రంగాచార్యులు, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్, దాత గొట్టిముక్కల భీమరాజు, ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమార రామగోపాల రాజాబహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆర్డీవోలు కె.మాధవి, అఖిల, డీఎస్పీ మురళీమోహన్, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జినాయుడు, బైరా నాగరాజు, కడలి వెంకటరత్నం పాల్గొన్నారు. రాత్రి స్వామివారికి తిరుమంజనాలు, దర్పణ సేవ, ధూపసేవ, విశ్వక్సేనారాధన నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో నరసన్నకు ఘనంగా శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. చెంగేల విన్నపం అనంతరం స్వామి పవళింపు సేవతో తీర్థ మహోత్సవాలు ముగిశాయి.

పుష్కరిణి సంప్రోక్షణ

నరసింహస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించేందుకు ఆలయ ఉత్తర ఈశాన్య భాగంలో నూతన పుష్కరిణి ఏర్పాటు చేశారు. తొలుత త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన ప్రయాగ్‌రాజ్ జలాలతో నూతన చెరువుకు సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవ ఏర్పాట్లను ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ మురళీమోహన్, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ గురువారం తెప్పోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన పుష్కరిణి వద్ద ఎటువంటి తొక్కిసలాట జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మనోహరం.. భీమేశ్వరుని జలవిహారం


హంసవాహనంపై విహరిస్తున్న భీమేశ్వరుడు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి తెప్పోత్సవం సప్తగోదావరి నదిలో నయన మనోహరంగా జరిగింది. రాత్రి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని మంగళ వాయిద్యాల మధ్య సప్త గోదావరిలో విద్యుద్దీపాలు, పుష్పాలంకృతమైన హంసవాహనంపై ఆసీనులను చేశారు. వేద పండితుడు బులుసు రామకృష్ణ బృందం చేసిన ఆస్థాన పూజ అనంతరం స్వామివారు జలవిహారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తన్మయత్వంతో తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

17, 19 తేదీల్లో కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి ఈనెల 17, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సుకు టికెట్స్ కావాల్సిన భక్తులు ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ బస్సులు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో అయోధ్య, వారణాసి క్షేత్రాలు చూపించి ఏడు రోజుల అనంతరం కాకినాడ చేరుతుందన్నారు. ఈ బస్సుకు టిఫిన్స్, భోజనాలతో సహా ఒకో టిక్కెట్‌కు 10వేలుగా నిర్ణయించారన్నారు. టికెట్స్ బుకింగ్ కోసం 73829 10869, 73829 10778 నెంబర్లను సంప్రదించలన్నారు.

16 నుంచి అచ్యుతాపురం రైల్వేగేటు మూసివేత

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరం పరిధిలో ఉన్న అచ్యుతాపురం రైల్వేగేటును ఈనెల 16వతేదీ నుంచి మూసివేస్తున్నట్లు కాకినాడ రైల్వే సెక్షన్ ఇంజనీరు రమేష్, అసిస్టెంట్ ఇంజనీరు శాస్త్రి తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మరమ్మతుల నిమిత్తం 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పదిరోజులపాటు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. అచ్యుతాపురం పరిసర ప్రాంతాల వాసులు ప్రత్యామ్నాయ మార్గాలద్వారా పయణించి రైల్వేఅధికారులకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. మరమ్మతులు పూర్తి అయ్యిన తర్వాత వాహనాల రాకపోకల యధావిధిగా సాగుతాయన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచిడెల్టా కాలువలకు 8850క్యూసెక్కుల విడుదల చేస్తుండగా గోదావరి నీటి లభ్యత 8618క్యూసెక్కులుగా ఉంది. గోదావరిలో నీటి లభ్యత తగ్గుతూ ఉండటంతో పాండ్‌లో నిల్వ ఉన్న నీటిని విడుదల చేస్తున్నారు. దీని వల్ల గోదావరి నీటి మట్టం నాలుగు రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. సోమవారం 9.95 అడుగులుగా ఉన్న నీటి మట్టం గురువారం నాటికి 9.45 అడుగులకు చేరుకుంది. సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కులు గోదావరికి విడుదలవుతుండగా బైపాస్ మార్గం ద్వారా మరో 3వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో పోలవరం వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం నుంచి నీరు దిగువకు ప్రవహించడంతో ఉన్న అడ్డంగుల వల్ల ధవళేశ్వరం వద్దకు చేరడం ఆలస్యమవుతోంది. దీంతో పాండ్‌లో ఉన్న నీటిని గోదావరికి విడుదల చేస్తూ ఉండడంతో నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. కాగా గురువారం తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మించిన భవనాల గుర్తింపు


అధికారులు గుర్తించిన బహుళ అంతస్తుల భవనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) చోళుల కాలంలో సర్పవరంలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ సమీపంలో ఆగమ శాస్త్రం నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. ఆలయ నిర్మాణం, పూజలు, ఆచారాలు వంటి వాటికి సంబంధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆలయం గోపురం, ధ్వజస్తంభం, ప్రహరీ నుంచి సుమారు 200 మీటర్ల మేర గాలి గోపురం కంటే ఎత్తులో ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలున్నాయి. అయితే భావనారాయణ స్వామి తూర్పు దిక్కులో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, రోడ్డు వెలుపలకు వచ్చి జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల మనోభావాలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలను అడ్డుకోవాలని పురావస్తు శాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

సర్పవరంలో పర్యటించిన పురావస్తుశాఖాధికారులు

ఈ మేరకు గురువారం కాకినాడ జిల్లా పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు దేవాదాయ,ధర్మాదాయ శాఖ సిబ్బందితో కలసి సర్పవరం పర్యటించారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో జరుగుతోన్న బహుళ అంతస్తుల భవనాలు, రోడ్డు వెలుపలకు వచ్చి నిర్మించిన పలు కట్టడాలను గుర్తించారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రాకారానికి ఎత్తులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఇటువంటి భవన నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వరాదన్నారు. ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మించిన భవన యాజమానులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

జబర్దస్త్ నటుల సందడి



కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంలో శ్రీసత్తెమ్మ తల్లి జాతర సందర్భంగా గురువారం రాత్రి జబర్దస్త్ నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా నటుల రాకతో వారి చేసే కామెడీ ప్రదర్శనను పెద్దఎత్తున తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

ముగిసిన నరసింహస్వామి అధ్యయనోత్సవాలు



కోరుకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి అధ్యయన మహోత్సవాలు గురువారం ముగిశాయి. భీష్మ ఏకాదశి రోజున చేపట్టిన ఈ అధ్యయనోత్సవాలు 5రోజుల పాటు నరసన్న కొండపైన అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గురువారం కొండపైన బేడా ఉత్సవం, శ్రీ నన్నార్వాళ్ల పరమ పద ఉత్సవం నిర్వహించారు. అనంతరం 5రోజులు కొండపై ఉండి పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దిగువ దేవస్థానానికి తీసుకువచ్చారు.

శేష వాహనంపై గ్రామోత్సవం

శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి గ్రామోత్సవం శేషవాహనంపై కన్నుల పండువగా జరిగింది. నరసింహస్వామి అధ్యయనోత్సవాలు ముగిసిన సందర్భంగా గురువారం రంగనాథస్వామి ఆలయంలో రెండు రోజులపాటు జరిగే అధ్యయనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సేవా కాలం, రాత్రి బేడా ఉత్సవం జరిగాయి.

పూట గడవడానికి...
నాటు తెప్ప..!





కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం సుబ్బంపేట తీరంలో నాటు తెప్పపై వేటకు వెళుతున్న మత్స్యకారుడు

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాలకు చెందిన మత్స్యకార కుటుంబాల్లో కొందరికి నాటు తెప్పే జీవనాధారం. అయితే లక్షల వ్యయంతో బోట్లు తయారు చేయించుకుని కోట్లు సంపాదించుకున్న మత్స్యకారులు ఉన్నారు. అదే మత్స్యకార కుటుంబాల్లో ఏ పూటకో పూట వేటకు వెళితే కానీ ఇల్లు గడవని పరిస్థితి. ఇదే తరహాలో ఇంకా నేటికీ ఉప్పాడ తీరప్రాంత గ్రామాల్లో అనేక కుటుంబాలు ఉన్నాయి. వారిలో చాలా మంది కర్ర తెప్పలు, కొందరు నాటు తెప్పలు(థర్మోకోల్ అట్టలు) తయారు చేసుకుని వేటకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఇలా కర్ర, నాటు తెప్పలతో మత్స్యకారులు సముద్రం ఒడ్డు నుంచి సుమారు 100 నుంచి 200 మీటర్ల మేర వేట చేస్తారు. అదృష్టం బాగుంటే ఆ రోజు కూలి పనుల డబ్బులు గిట్టుబాటు అవుతాయి. లేకుంటే ఆ రోజుకు కష్టం వృథాగా పోతుంది. పేద, బడుగు మత్స్యకారులకు ఫైబర్ తెప్పలను ప్రభుత్వం మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బరిలో 35 మంది

- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం 54మంది నామినేషన్లు దాఖలు
- స్క్రూట్నీలో 11 నామినేషన్ల తిరస్కరణ
- పోటీ నుంచి 8మంది విరమణ

ఏలూరు/రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. బరిలో 35 మంది పోటీ పడుతున్నారు. మొత్తం 54మంది నామినేషన్లు దాఖలు చేయగా 11మందిని స్క్రూట్నీలో తిరస్కరించారు. మరో 8మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈనెల 27న జరగనున్న పోలింగ్‌లో 35మంది బరిలో నిలిచారు. ఇందులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థిగా డీవీ రాఘవులు, స్వతంత్ర్య అభ్యర్థిగా మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ కొడుకు జీవీ సుందర్, రాజమండ్రికి చెందిన రిటైర్డ్ సీటీవో బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి వంటి వారు కూడా పోటీలో ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,13,126ఓట్లు ఉన్నాయి. ఈ స్థానాన్ని ఎలాగైనా గెలిపించుకోవాలనే లక్ష్యంతో అధికార కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈనెల 27న ఉదయం 8 నుంచి 4 గంటల వరకు జరిగే పోలింగ్ ఏర్పాట్లపై ఏలూరు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కానుంది.

రంగంలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం(కూటమి అభ్యర్థి), దిడ్ల వీరరాఘవులు(పీడీఎఫ్), కాట్రు నాగబాబు, షేక్ హుస్సేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నేరి, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణశర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్ రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవీప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్‌బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్ఝల, జీవీ సుందర్, హసన్ షరీఫ్ బరిలో నిలిచారు. ఉపసంహరించుకున్న వారి పేర్లు... గద్దె విజయలక్ష్మి, డాక్టర్ కవల నాగేశ్వరావు, పచ్చిగోళ్ల దుర్గారావు, పేరాబత్తుల సత్యవాణి, బాలాజీ గుండుమోలు, పిళ్లంగోళ్ల లీలా నగేష్, సత్తిరాజు స్వామి, చక్రపాణి.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : వెట్రిసెల్వి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని ఏలూరు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సమక్షంలో పోటీలో నిలిచిన అభ్యర్థులతో వెట్రిసెల్వి గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా పాటించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు తావివ్వద్దని సూచించారు. టీవీ, ఇతర సోషల్ మీడియా ప్రచారం కోసం మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు సంప్రదించాలని కోరారు. ఏఆర్‌వో వి.విశ్వేశ్వరరావు, ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

సత్తిరాజుస్వామి నామినేషన్ ఉపసంహరణ

టీడీపీలో చేరిక..పేరాబత్తులకు మద్దతు

అమలాపురం/ఏలూరు ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన సత్తిరాజు ఎస్‌వీయూఆర్ స్వామి నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం స్వామి తన నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. ఎమ్మెల్సీ పోటీ నుంచి వైదొలిగి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా పనిచేయాలని టీడీపీ అధిష్ఠానం కోరడంతో స్వామి ఈ నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉపద్రష్ట నాగార్జున వెంట ఉండి స్వామితో విత్ డ్రా చేయించారు. అలాగే సత్తిరాజుస్వామి తన మిత్రులతో కలిసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడును వారు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కోసం పని చేయాల్సిందిగా ఆయన కోరారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన సత్తిరాజుస్వామి

ప్లాన్ చేసి... అన్నను బురిడి కొట్టించిన తమ్ముడు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడిన ఓ తమ్ముడు(వరుసకు) అన్నకే కన్నం వేశాడు. త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్యాపురానికి చెందిన సుమన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి వర్క్‌ఫ్రం హోం చేస్తూ రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. ఈనెల 7న వీ అండ్ టీ కాలనీలో నివాసం ఉంటున్న చిన్నమ్మ కొడుకు ఉయ్యూరి ప్రభ రవితేజతో కలిసి బైక్‌పై వెళుతుండగా కోరుకొండ రోడ్డు మార్కెట్ యార్డు వద్దకు వచ్చేసరికి మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అటకాయించి కత్తితో బెదిరించి 2సెల్‌ఫోన్లు, 4 కాసుల బంగారు గొలుసు, 2 ఉంగరాలు దోచుకెళ్లారు. దీనిపై త్రీటౌన్‌లో సుమన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయం బయటపడింది. విచ్చలవిడిగా తిరగడం అలవాటైన రవితేజకు సుమన్ బంగారు వస్తువులు, ఖరీదైన సెల్‌ఫోన్‌పై కన్ను పడింది. తన స్నేహితుడైన తాడితోట శాంతిపురానికి చెందిన మంతెన గోపి, అల్కాట్‌తోటకు చెందిన నీలాపు శ్యాం సుందర్ రెడ్డితో కలిసి ప్లాన్ చేశాడు. సుమన్‌ని బైక్‌పై కోరుకొండ రోడ్ వైపు తీసుకెళ్లగా ఆ ప్లాన్‌ని అమలు చేశారు. తన సెల్‌ఫోన్, ఒక ఉంగరాన్ని కూడా భయపడి గోపి, శ్యాంకి ఇచ్చేసి సుమన్‌ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిజం కక్కలేక తప్పలేదు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ పేర్కొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

6.200 కిలోల గంజాయి స్వాధీనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో గురువారం 6.200 కిలోల గంజాయితో పాటూ ముగ్గురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపే చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో గురువారం సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ దండుపుంతకు చెందిన వలస గిరిధర్, స్థానిక ఏపీఎస్పీ ఇందిరాకాలనీకి చెందిన మీశాల వివేక్ అనే యువకులతో పాటూ సీసీఎల్ (మైనర్) ముగ్గురు కలిసి రమణయ్యపేట కాలువ బండ వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న 6.200 కిలోల గంజాయిని గుర్తించి పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఏ పనీపాటూ లేకుండా మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారి డబ్బుల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లా ధారకొండ నుంచి గంజాయి తీసుకువచ్చినట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు గంజాయిని రవాణా చేస్తూండగా పట్టుకున్నామన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టప్రకారం ఎస్ఐ శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



గంజాయి, పట్టుబడ్డ ముగ్గురు నిందితులతో సర్పవరం పోలీసులు

మోటార్‌సైకిల్ అదుపు తప్పి...
బాలుడి మృతి

మరో బాలుడికి తీవ్రగాయాలు

పెద్దాపురంలో ఘటన



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ



చికిత్స పొందుతున్న సత్యదుర్గాగణేష్



మృతిచెందిన నాగూర్(ఫైల్‌ఫొటో)

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో మహారాణి కళాశాల సమీపంలో అతివేగంతో మైనర్లు నడుపుతున్న మోటార్‌సైకిల్ నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో దేగల నాగూర్(15) అనే బాలుడు చికిత్స పొందుతూ కాకినాడ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో బాలుడు పెనుగొండ సత్య దుర్గాగణేష్(14) తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్దాపురానికి చెందిన వారిద్దరూ గురువారం సాయంత్రం పెద్దాపురం నుంచి సామర్లకోట వైపునకు మోటార్ సైకిల్‌పై అతి వేగంగా వస్తూ ఎదురుగా యాటర్న్ చేస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో యాక్సిస్ మోటార్‌సైకిల్ ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొని అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యింది. సమాచారం తెలిసిన వెంటనే పెద్దాపురం ఎస్ఐ మౌనిక తన సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని పోలీసు వాహనంలోనే బాలురను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగూర్ మృతిచెందాడు. తీవ్రగాయాలతో సత్య దుర్గాగణేష్‌తోపాటు మరొక వ్యక్తి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం జన్మ నక్షత్ర పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువజామున రెండుగంటలకు స్వామి, అమ్మవార్ల మూలవరులను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలను ధరింప చేశారు. ప్రత్యేకపూజలు సందర్భంగా ఉదయం 6.30కు సర్వదర్శనాలకు అనుమతించారు యాగశాలలో ఆయుష్యహోమం నిర్వహించారు. మఖనక్షత్ర పూజలకు 17 జంటలు టిక్కెట్లు కొనుగోలుచేసి వీటిలో పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శానిటరీ నిర్వహణపై చేతులెత్తేసిన కాంట్రాక్ట్ సంస్థ

చేయలేమని అన్నవరం దేవస్థానానికి లేఖ

అన్నవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శానిటరీ నిర్వహణను దక్కించుకున్న కె.ఎల్.టి.ఎస్ సంస్థ తమ గడువు పూర్తయిందని నిర్వహణ చేయలేమని దేవస్థానానికి లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పారిశుధ్య కార్మికులు, నిర్వహణ మెటీరియల్‌కు దేవస్థానం కెఎల్‌టీఎస్ సంస్థకు ప్రతినెలా ప్రస్తుతం రూ.52.70 లక్షలు చెల్లిస్తుండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండరు దక్కించుకున్న ఈ సంస్థ కాలపరిమితి గతేడాది నవంబరుతో ముగిసింది. నూతన టెండర్లుకు దేవాదాయ కమిషనర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అదే సంస్థతో ఇప్పటివరకు కొనసాగించారు. తాజాగా లేఖ అందజేయడంతో ఏమిచేయాలా అనేదానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దేవదాయ కమిషనర్ ఆదేశాలు వచ్చే వరకూ దేవస్థానమే నిర్వహించాలా లేకుంటే స్థానికంగా ఉన్న మరో సంస్థకు అప్పగించాలి అనే ఆలోచనలో ఉన్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. దేవదాయ కమిషనర్ ఆదేశానుసారం వ్యవహరిస్తామని అన్నారు.

అన్నవరం దేవస్థానం కాంట్రాక్టర్‌కు

వినియోగదారుల ఫోరం భారీ వడ్డన

అన్నవరం/కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో మొబైల్ డిపాజిట్ కౌంటర్‌లో నిర్దిష్టమైన చార్జీలకన్నా అధికచార్జీ లు వసూళ్లు చేస్తున్నందున సంబంధిత కాంట్రాక్టర్‌కు సీహెచ్ రఘుపతి వసంతకుమార్, చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వర్ రావ్‌లతో కూడిన కాకినాడ వినియోగదారుల కమిషన్ భారీగా జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన జల్లి గంపల లక్ష్మీనారాయణ గత ఏడాది నవంబరు 3వ తేదీన అన్నవరం సత్యన్నారాయణస్వామి దైవదర్శనార్థం రూ.రెండు వందలతో టికెట్‌ను కొనుగోలుచేసి అనంతరం తన మొబైల్ ఫోన్‌ను సత్యదేవ మొబైల్ అండ్ కెమెరా డిపాజిట్ సెంటర్ ఈస్ట్ వన్‌లో డిపాజిట్ చేశాడు. దర్శనానంతరం ఈ బిల్ ద్వారా మొబైల్ ఫోన్ తీసుకునేందుకు డిపాజిట్ సెంటర్‌కు వెళ్లాడు. అక్కడ అదనంగా రూ.10 ఇవ్వాలని అడగ్గా ఏ బోర్డుపైన చెల్లించ వల్సిన రుసుము రూ.10ఏ బోర్డుపైన ఎందుకు ప్రదర్శించలేదని లక్ష్మీనారాయణ కౌంటర్‌లో ఉన్నవారిని అడిగాడు. దాంతో రూ.10 చెల్లించకపోతే మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వమని వారు బదులిచ్చారు. వెంటనే లక్ష్మీనారాయణ సంబంధిత దేవస్థాన అధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా స్పందించలేదు. దాంతో ఆయన గత ఏడాది డిసెంబరు 4న వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం కమిషన్ రూ.5 వసూలు చేయడానికి మాత్రమే అనుమతి ఉందని, అయితే కాంట్రాక్టర్ మరో రూ.5ను అదనంగా వసూలు చేయడం తప్పిదంగా పరిగనిస్తూ ఫిర్యాదుకి కాంట్రాక్టర్ రూ.15 వేలు, అలాగే వ్యాజ్యం ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే కాంట్రాక్టర్ దేవస్థానం యాజమాన్యానికి రూ.5లక్షలు జరిమానాగా చెల్లించాలని ఆదేశించింది. రెగ్యులేటరీ చర్యలలో భాగంగా దేవస్థానంలో అన్ని దుకాణాలలో సుంకం బోర్డులు ప్రదర్శించాలని మరింత దుర్వినియోగాలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తూనికలు, కొలతలు శాఖకు సూచించింది.

వరుస ఫిర్యాదుల నేపథ్యంలో
మేల్ నర్సుపై విచారణ

- ప్రత్యేక కమిటీ నియామకం

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా పనిచేస్తున్న పోలాబత్తిన శ్రీనివాస్‌రావుపై వరుస ఫిర్యాదులు వస్తున్న నేపథ్య ంలో కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆర్ఎంఓ ఏడీ శ్రీనివాస్‌లను విచారణాధికారులుగా నియమిస్తూ అలాగే సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఛైర్మన్‌గా ఒక ప్రత్యేక కమిటీని నియమించారు. ఇటీవల శ్రీనివాసరావు ఖాళీ పత్రాలపై సుమారు 60మంది స్టాఫ్ నర్సులతో సంతకాలు చేయించాడు. వారు ఎందుకు అని ప్రశ్నిస్తే నర్సుల సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించేందుకు అని చెప్పాడు. ఈవిషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టి అతను నర్సులను తప్పుదోవ పట్టించాడని తనకు గిట్టని వారిపై కక్షపూరితంగా ఖాళీపత్రాలపై సంతకాలు చేయించాడని అధికారులు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ విషయంపై శ్రీనివాసరావు ఎన్‌జీవో సంఘ నాయకుల పేర్లను వాడుకోవడంపై ఆ సంఘ నాయకులు శ్రీనివాస్‌రావుపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ ద్వారా తనకు అవార్డు ఇచ్చేందుకు ఆసుపత్రి అధికారులు సిఫార్సు చేయలేదన్న అక్కసుతో అధికారులను రకరకాల బెదిరింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ ఈవిషయాన్ని తీవ్రం గా పరిగణలోకి తీసుకున్నారు. నిజానిజాలను రాబట్టేందుకు ప్రత్యేకకమిటీ నియమించాలని సూపరిం టెండెంట్‌ను ఆదేశించిన నేపథ్యంలో కమిటీ ఏర్ప డింది. ఈనెల 15వ తేదీలోపు విచారణ పూర్తిచేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశాలలో తెలియజేశారు.

కోనసీమ ప్రభల ఉత్సవాన్ని
రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

- సీఎం చంద్రబాబును కోరిన కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి



అమరావతిలో సీఎం చంద్రబాబుకు కోనసీమ ప్రభల ఉత్సవంపై లేఖను అందిస్తున్న కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి

అంబాజీపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిచెందిన కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ పొదపాటి తేజస్వి కోరారు. ఈ మేరకు అమరావతిలో చంద్రబాబుకు జగ్గన్నతోట ప్రభల తీర్థ విశిష్టతను వివరిస్తూ లేఖను అందించారు. 450 ఏళ్ళకు పైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రతి ఏటా కనుమ రోజున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోట లో నిర్వహిస్తారన్నారు. ఈ తీర్థానికి దేశవిదేశాలలో ఉన్న సుమారు 4 లక్షలకు మందికిపైగా భక్తులను ఆకర్షిస్తూ, కోనసీమ ప్రాంతపు సంప్రదాయాలకు, ప్రజా సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తొందన్నారు. ఈఉత్సవాన్ని ప్రధాని నరేంద్రమోదీ, భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖ ప్రశంసించాయన్నారు. ఈ ప్రతిపాదనను ఇప్పటికే పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌కు సమర్పించిన్నట్లు తేజస్వి తెలిపారు. ఈ విషయంపై సానుకూలంగా స్వీకరించారన్నారు. కోనసీమ ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇవ్వడంవల్ల తెలుగు సంస్కృతి పునరుద్ధరించడమే కాకుండా స్థానికంగా ఘనంగా జరుపుకునే సంప్రదాయాలకు మరింత గౌరవం చేకూరుతుందని తేజస్వి పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను సీఎం సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తేజస్వి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య



మృతురాలు దుర్గాభవాని

చాగల్లు, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వివాహిత మహిళ పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని చిక్కాలలో జరిగింది. ఎస్ఐ కే నరేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం బొర్రా దుర్గాభవానికి (35), సురేంద్ర గౌడ్‌తో పదమూడు సంవత్సరాల క్రితం వివా హం జరిగింది. వారికి అమ్మాయి జోత్స్న రత్నశ్రీ (11), అబ్బా యి జయదీప్ (9) ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు, గత కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు చోటుచేసుకున్నాయి. కుటుంబ ఆర్థికఇబ్బందులు తీరకపోగా మరింత ఎక్కువ కావడంతో ఆమె మానశింగాను డిప్రెషన్‌కు గురైంది. అన్నయ్య ఆమెను స్థానికంగానే వారి ఇంటికి తీసుకుని వెళ్లాడు. భర్త లారీపై కిరాయితో హైదరాబద్‌కు వెళ్లాడు. ఎవరు లేని సమయంలో ఇంటి వద్దనే కలుపు మందు పిల్లలకు తాగించి ఆమె తాగింది. తాను చనిపోతే పిల్లలు ఆలన పాలన ఉండదని, ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారికి కూడ పురుగుమందు తాగించింది. విష యం తెలుసుకున్న బంధువులు వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దుర్గాభవాని మార్గమధ్యలోనే మరణించింది. పిల్లలు రాజమహేంద్రవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. మృతురాలి అన్నయ్య రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆబోతును ఢీకొని వ్యక్తి మృతి



మురళీకృష్ణ(ఫైల్)

అంతర్వేది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన మురళీకృష్ణ బుధవారంరాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆబోతును ఢీకొని మృతి చెందినట్టు భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపారు. సంవత్సరం క్రితం వివాహమైన మురళీకృష్ణకు జనవరి నెలలో పాప పుట్టింది. గురువారం భార్యతో మోరిపోడు వెళ్లివస్తానని చెప్పిన మురళీకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఇరువురు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి తేలారు. మోటారుసైకిల్‌పై వెళుతున్న మురళీకృష్ణ ఆబోతును ఢీకొనడంతో మెడపై తీవ్ర గాయమై రక్తస్రావంతో పడి ఉన్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారని ఫిర్యాదులో శిరీష పేర్కొన్నారు.

వైన్‌షాపులపై మెరుపుదాడులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించిన వైన్‌షాపుల పై కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో మెరుపుదాడులు నిర్వహించారు. ఎస్పీ జి.బింధుమాదవ్ ఆదేశాను సారం ఎస్‌డిపిఓ ప్రత్యేక పోలీస్ బలగాలతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రాత్రి 10గంటల తరువాత తెరచి ఉంచిన వైన్‌షాప్‌లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులు కాకినాడ సిటీలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు షాపులు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుషాపులు, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండుషాపులు మొత్తం 8షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

21న పెన్షన్ అదాలత్ : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):ఈనెల 21న పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో విధాన గౌతమి మీటింగ్ హాల్‌లో ఉదయం 10గంటలకు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ వంపిణీ అధికారులు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, సమస్యల వివరాలతో హాజరుకావాలన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సభ్య కార్యదర్శిగా శరత్‌కుమార్

అమరావతి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీవోఎస్‌టీ) సభ్య కార్యదర్శిగా కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.శరత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగవచ్చని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ శరత్‌కుమార్ గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో ఆర్ అండ్ డీ, పీఆర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

వరి తెగుళ్లపై అవగాహన

అంతర్వేది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, వీవీమెరక, రామేశ్వరం గ్రామాల్లో వ్యవసాయాధికారి పీవీనరసింహారావు ఆధ్వర్యంలో ఆర్సీసీ ప్రచారం విస్తృతంగా చేశారు. రైతులకు దాళ్వా సాగులో వచ్చే తెగుళ్లపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా ఎలుకల మందును పంపిణీ చేశారు.

రాంబాబుకు ఆర్థిక సాయం

అమలాపురం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): తాపీ పనిచేసుకుని జీవించే అల్లవరం మండలం బోడసకుర్రు పల్లపువీధికి చెందిన ఆదిమూలపు రాంబాబు భవనంపై నుంచి పడి మంచానపడ్డాడు. ఆలమూరు మండలం కలవచర్లకు చెందిన కూటమి నేత వడ్డి మణిబాబు, కోన శ్రీనివాసరావు, గంగవరపు మణికంఠలు నగదు, బియ్యం బస్తా ఇచ్చారు.

గ్రామాలను సుందరీకరించాలి: ఎమ్మెల్యే దేవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీల్లో ప్రతీ గ్రామాన్నీ సుందరీకరించడానికి అందరూ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం గుడిమెళ్లంకలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాల్వల్లో తీసిన పూడికలను ప్రభుత్వ పాఠశాలల లోతట్టు ఆవరణలో వేయాలన్నారు. రెవెన్యూ పంటబోదెలు, ఆక్రమణలు గుర్తించి రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వం ఖాళీ స్థలాలను గుర్తించాలని, డంపింగ్ యార్డుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కాల్వగట్లు బలహీనంగా ఉన్న చోట్ల గుర్తించి ఆ ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాజోలు నియోజకవర్గంలో 14వేల ఎకరాల రిజిస్టర్ ఆయకట్టు, 3400 ఎకరాలకు పడిపోయిందని, పంట బోదెలు, మురుగు కాల్వలను ఆక్రమణలు తొలగించడం ద్వారా రిజిస్టర్ ఆయకట్టులు పెంచడానికి ముందుకు రావాలన్నారు. నియోజకవర్గంలో గోకులాల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో డ్వామా ఏపీడీ మల్లికార్జునరావు, సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, డీసీ పినిశెట్టి బుజ్జి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల నాగు, తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో మల్లికార్జునరావు, మిల్టన్, రాకేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 వీఆర్వోలకు తహశీల్దార్ డీడీవోగా ఉండాలి

తహశీల్దార్‌కు వీఆర్వోల వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వీఆర్వోలంతా రెవెన్యూ శాఖ పరిధిలోని విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కోరింది. గురువారం మండల రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వీఆర్వోలంతా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మికి అందించారు. 2019లో సచివాలయ వ్యవస్థ ప్రారంభించినప్పుడు గ్రేడ్-1, గ్రేడ్-2గా విభజించి ఒకే జాబ్ కార్డు కలిగిన వీఆర్వోలకు తహశీల్దార్ డీడీవోగా, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్లను డీడీవోలుగా ఏర్పాటు చేయడం జరిగిందని, ఈవిధానం వల్ల ఒక పక్క లైన్ డిపార్టుమెంటు పనుల్లో భాగంగా తహశీల్దార్ చెప్పిన పనులు చేస్తూ పంచాయతీ సెక్రటరీ, మున్సిపల్ కమిషనర్లు కూడా పనులు అప్పగించడంతో గ్రేడ్-2 వీఆర్వోలకు పని ఒత్తిడి పెరిగిపోయిందన్నారు. వీఆర్వోలకు ఒకే రకమైన జాబ్‌కార్డు కలిగి ఉన్నప్పటికీ గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్వోలకు వేర్వేరు డిపార్టుమెంట్ల వారు డీడీవోలుగా ఉండడం వల్ల గ్రామరెవెన్యూ అధికారులు ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు హేతుబద్ధీకరణ చేయడానికి కేబినేట్ సమావేశం నిర్ణయం తీసుకోవడం జరిగిందని, దీనిలో భాగంగా గ్రామరెవెన్యూ అధికారులకు తహశీల్దార్ డీడీవోగా ఉండేలా విధివిధానాలు ఖరారు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. రెడ్డి సుబ్రహ్మణ్యం, కడలి బాలాజీ, కనకాల వెంకట్రావు, ఆర్.భాస్కరరావు, లంక నాగేంద్రప్రసాద్, దారా కమల తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పలు చోట్ల ప్రచారం



అమలాపురంలో రాజశేఖర్ విజయాన్ని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పట్టభద్రులను కోరారు. పట్టణ పరిధిలోని 6, 7, 8, 9 వార్డుల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడు పెచ్చెట్టి బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్ తదితరులు ఆయా వార్డుల్లో సభలు నిర్వహించి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, చిక్కాల గణేష్, బండారు వెంకన్నబాబు, యేడిద శ్రీను, కంచిపల్లి అబ్బులు, భాస్కర్ల రామకృష్ణ, నల్లా స్వామి, పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి బాబ్జి, పిండి అమరావతి, గండి దేవీహారిక పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ దువారపు విజయరామారావు పిలుపునిచ్చారు. గంటిపెదపూడి, ఉడిమూడి గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, పల్లి మోసే, దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, తిక్కా సత్తిబాబు, కొమ్ముల శ్రీను, యడ్ల ఏసుభాస్కరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, బొరుసు సుబ్బరాజు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): బలుసుతిప్పలో గురువారం సంగాని వెంకటేష్ ఆధ్వర్యంలో వెంట్రు సుధీర్ పర్యవేక్షణలో పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలని కోరారు. తిరుమాని వీరబాబు, శేషాద్రి, సంగాని రాజీవ్, ఓలేటి ధనిష్ఠ, కడలి వెంకటసత్యనారాయణ, కాశి జ్యోతిబాబు, కొప్పూరి శ్రీనివాసరాజు, ఇసుకపట్ల గోవింద్ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. మామిడికుదురు, గెద్దాడ, కొమరాడ, ఈదరాడ గ్రామాల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, ఈలి శ్రీనివాస్, చాగంటి స్వామి, ఉండ్రు శ్రీరామారావు, రుద్ర శ్రీను, యింటి మహేష్, మట్టా సత్తిబాబు, దొడ్డా జయరామ్, కంచి విశ్వనాథం పాల్గొన్నారు.మామిడికుదురు దీప్తి కళాశాలలో ఉపాధ్యాయులను సీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు కలుసుకుని రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిమ్మకాయల శేషు, సూర్య, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవాలు : ఆర్డీవో



తెప్పోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో కె.మాధవి

అంతర్వేది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో పదిరోజులు స్వామివారి తిరు దివ్య కల్యాణ మహోత్సవాలను వైభవోపేతంగా జరిపినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆర్డీవో కె.మాధవి తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మార్గనిర్దేశం, పర్యవేక్షణలో ఉత్సవాలను విజయవంతంచేసి లక్షలాది మంది భక్తులకు కల్యాణం, దర్శనం సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. ఉత్సవాల ముగింపురోజు గురువారం ఆర్డీవో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది ఉత్సవాలను అంగరంగ వైభవంగా జిల్లా అధికారుల సమన్వయంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. 4న రథోత్సవంతో ప్రారంభమై స్వామివారి గ్రామోత్సవాలతో, 7న స్వామివారి కల్యాణం, 8న రథోత్సవం, 12న చక్రస్నానం, గురువారం తెప్పోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన జిల్లా అధికారులు, ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈఉత్సవాల్లో సుమారు 7లక్షల మంది పాల్గొన్నారన్నారు. ఆర్డీవోలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు, ఆలయ అధికారులు, జిల్లా నీటియాజమాన్య సంస్థ పాలక సంచాలకులు, జిల్లా పంచాయతీ అధికారులు, పోలీసు యంత్రాంగం, మెరైన్‌విభాగ సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఉత్సవాలను జయప్రదం చేయడంలో సహకరించారన్నారు.

గౌతమ్‌బాబు ప్రచారం

అల్లవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి కొల్లు గౌతమ్‌బాబు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సామంతకుర్రు గ్రామానికి చెందిన కొల్లు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎలుకలను నివారించి పంటను కాపాడుకోవాలి

- డాట్ సైంటిస్ట్ డాక్టర్ నందకిశోర్, రైతు సేవాకేంద్రం సీఅండ్ డీఏ వెంకటేశ్వర్లు
- పలుచోట్ల ఎలుకల నివారణ మందు పంపిణీ



అమలాపురం: నడిపూడిలో సామూహిక ఎలుకల నిర్మూలనలో పాల్గొన్నరైతు సేవా కేంద్రం సీఅండ్ డీఏ వెంకటేశ్వర్లు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పంటచేలో ఎలుకల బెడదను నివారించి వరి పంటను కాపాడుకోవాలని డాట్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.నందకిశోర్, రైతు సేవాకేంద్రం సీఅండ్ డీఏ జి.వెంకటేశ్వర్లు అన్నారు. నడిపూడిలో గురువారం సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించారు. ఎలుకల విషపు ఎర తయారుచేసే విధానాన్ని డాక్టర్ నందకిశోర్ వివరించి చూపించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్, ఏఈవో డి.ప్రేమ్‌కుమార్, ఈతకోట వెంకటప్రసాద్, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, బైరిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ సూచించారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం గ్రామాల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. పొలం గట్లు, కొబ్బరితోటల గట్లు, కాలువ గట్లపై కూడా ఎలుకల నివారణ మందు పెట్టాలన్నారు. ఏఈవో డి.దుర్గారావు, వీఏఏ బాలకృష్ణ, వీహెచ్ఏ పాండురాజు రైతులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): సామూహిక ఎలుకల నివారణకు వ్యవసాయశాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేసినట్టు మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద మందును పంపిణీ చేపట్టామన్నారు. రైతులు ఎలుకలను సమర్థవంతంగా నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో సామూహిక ఎలుకలనిర్మూలన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీడీఏ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రైతులకు ఎలుకల జీవిత చక్రం గురించి వివరించారు. రైతులకు ఎలుకల మందు, నూకలు కలిపిన మిశ్రమాన్ని పంపిణీ చేశారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి, డాట్ సైంటిస్ట్ నందకిశోర్, డీఆర్సీ ఏడీఏ రాజశేఖర్, ఏడీఏ రామ్మోహన్, మండల వ్యవసాయా శాఖ అధికారి మధుకుమార్ పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): వరి పంటలో నష్ట తీవ్రత తగ్గించడానికి రైతులంతా సామూహిక ఎలుకల నివారణ మందు ఉపయోగించాలని మండల వ్యవసాయాధికారి నందెపు వీరవెంకటసత్యనారాయణ అన్నారు. అల్లవరం, కోడూరుపాడు తదితర ప్రాంతాల్లో ఎలుకల బొరియల వద్ద బ్రోమోడయోలిన్ మందును పెట్టించారు. బొక్కా నాగశివప్రసాద్, పాటి సింహాద్రి, వాసర్ల సూర్యనారాయణ, మొల్లేటి శుభగణేష్, కె.రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు యానాం రానున్న పుదుచ్చేరి ఎంపీ

యానాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ఎంపీ వి.వైద్యలింగం శుక్రవారం యానాం రానున్నట్లు ఎంపీ కార్యదర్శి ఎం.ఆర్.సంపత్‌కుమార్ తెలిపారు. ఎంపీ షెడ్యుల్‌ను యానాం పరిపాలనాధికారికి పంపారు. శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే యానాంలో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. శనివారం ఉదయం 10.30గంటలకు యానాం పరిపాలనాధికారి కార్యాలయ ప్రాంగణంలో జరిగే దిశపై సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రాజమండ్రి చేరుకుని విమానంలో పుదుచ్చేరి వెళ్తారు. ఆయనతో పాటు మాజీ సీఎం వి.నారాయణస్వామి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు యానాం రానున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

రాజోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో నూటికి నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం సూచించారు. రాజోలు మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సీఆర్ఎంపీల జాబ్ చార్టుల్లో భాగంగా పాఠశాలల సందర్శన, రిసోర్స్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. తాటిపాక, కడలి, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు అనుసరిస్తున్న ప్రణాళిక తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్కూలు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై తగిన శ్రద్ధ వహించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.ఎంఈవో-1 ఎన్.మనోహరం, ఎంఈవో-2 టీఎస్కేడీ ప్రసాదరావు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

అంబాజీపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నందంపూడి గ్రామానికి చెందిన ముత్తాబత్తుల ఆనందరావు అనారోగ్యంతో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జిల్లాలోని ముత్తాబత్తుల కుటుంబ సభ్యులు స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.26వేలు ఆనందరావు భార్య సత్యవతికి గురువారం అందించారు. కార్యక్రమంలో ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, వెంకటరమణ, నాగేశ్వరరావు, వీరవెంకట సత్యనారాయణ, గంగాధర్, తులసీ, దాస్, శ్రీమనరాజు, ఆనందరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సూర్యకుమారి ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన పీఈటీ సూర్యకుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాకినాడలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీగా పనిచేస్తున్న ఎ.సూర్యకుమారి పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్ విన్నర్‌గా, అథ్లెటిక్ ఈవెంట్లలో షాట్‌పుట్‌లో రజత, జావెలిన్‌త్రోలో కాంస్య పతకాలు సాధించింది. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం గుంట్రు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తదితరులు సూర్యకుమారిని ఘనంగా సత్కరించారు.

'కగార్' ఆపరేషన్ నిలిపివేయాలి



గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కగార్ పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను ప్రభుత్వం తన బలగాలతో హతమార్చడం హేయమైన అప్రజాస్వామిక చర్య అని ప్రజా సంఘాలు, హక్కుల సంఘాల నాయకులు విమర్శించారు. కగార్ ఆపరేషన్‌ను తక్షణం నిలిపివేయాలంటూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో గురువారం నిరసన ప్రదర్శన జరిపారు. అటవీ సంపదను, సహజ వనరులను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు ఆ ప్రాంత ప్రజలు, ఆదివాసీల ప్రాణాలను బలి పెట్టడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని విమర్శించారు. నిరసన ప్రదర్శనలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పీడీఎం రాష్ట్ర నాయకుడు దీపాటి శివప్రసాద్, ఏపీఆర్సీఎస్ జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు, పౌర హక్కుల సంఘం నాయకుడు అమలదాసు బాబూరావు, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లాప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్, శెట్టిబత్తుల తులసీరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న సూర్య వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ సిటిజన్ అథ్లెటిక్ మీట్‌లో అమలాపురం పట్టణానికి చెందిన జిల్లా క్రీడాకారులైన సోదరీమణులు మహబూబ్ షాహీరా, మహబూబ్ షకీలాలు వివిధ విభాగాల్లో ప్రతిభచాటి పతకాలు సాధించారు. వీరితో పాటు పట్టణానికి చెందిన ఎ.కామాక్షీ, ఎ.శిరీషాదేవిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారు. వీరిని అమలాపురం సూర్యవాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, గంగాధర్, కుడుపూడి బుజ్జి, ముంగర ప్రసాద్, చప్పిడి శోభన్‌బాబు, కుడుపూడి త్రినాథ్, కేవీ వెంకట్రావు, యనమదల బుజ్జి తదితరులు అభినందించి సత్కరించారు.

సత్వర సేవలు అందించేందుకు ప్రత్యేక వాహనం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆరోగ్య అవసరాలు గల పిల్లలను గ్రామాల నుంచి చికిత్స కోసం అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర తెలిపారు. పిల్లల కోసం అద్దెకు తీసుకున్న వాహనాన్ని గురువారం అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మితో కలిసి డీఎంహెచ్‌వో ఏరియా ఆసుపత్రి వద్ద ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఎన్‌సీడీ సీడీ సర్వేలో గుర్తించిన చిన్నారులను స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి సత్వర వైద్య సేవలు అందించేందుకు ఈవాహనాన్ని అందుబాటులో ఉంచినట్టు వివరించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జాన్‌లెవీ, రామకృష్ణ పాల్గొన్నారు.

రామేశ్వరాలయ నిర్మాణం త్వరలో పూర్తి

అల్లవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామునితో శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన రామేశ్వరాలయ నిర్మాణం జాప్యం జరగకుండా దాతల ప్రోత్సాహంతో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. రామేశ్వరాలయ ప్రాంగణం వద్ద ఆలయ చైర్మన్ అంగాని రామారావు అధ్యక్షతన గ్రామస్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాత అల్లూరి లక్ష్మీనరసింహరాజు (పెదబాబు) ఇప్పటికే రూ.25లక్షలు ఆలయ నిర్మాణానికి ఇచ్చారని, మరో రూ.30లక్షలు ఇవ్వడానికి ఆయన ముందుకు వస్తున్నారన్నారు. ప్రస్తుతం పునాది దశలో ఉన్న ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తవుతుందని దెందుకూరి భరోసా ఇచ్చారు. సమావేశంలో చింతా శ్రీనివాస్, మల్లాడి వెంకటరమణ, అంగాని శ్రీను, చక్కా సత్తిబాబు, కొల్లు నాగేశ్వరరావు, చక్కా నరసింహమూర్తి, వైదాడి నాగేశ్వరరావు, ఆలయ ఈవో సలాది సత్యమహేంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల బహూకరణ

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఇంగ్లీషు సబ్జెక్టులో నూటికి 99మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. మెరిట్ విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు రాయి వెంకటేశ్వరరావు గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వర్డ్ పవర్ మేడ్ ఈజీ, ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నూకల సత్యనారాయణ, అరవ స్వామినాయుడు, ఎం.పద్మనాభం, పీడీ కామన మధు తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న ఏటిగట్టు

భారీ వాహనాల రాకపోకలు మామూలే



నిబంధనలు అతిక్రమించి రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

కాట్రేనికోన, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మురమళ్ల- పల్లంకుర్రు ఏటిగట్టుపై భారీ వాహనాలు ప్రయాణించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు ప్రయాణించకుండా గతంలో హెడ్‌వర్క్స్ అధికారులు మురమళ్ల, కుండలేశ్వరం, పల్లంకుర్రు వద్ద గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల కందికుప్పలో సీసీ రోడ్డు నిర్మాణం జరగడంతో పల్లంకుర్రు వైపు నుంచి వచ్చే వాహనాలను పల్లిపాలెం, నడవపల్లి మీదుగా కాట్రేనికోన వచ్చే విధంగా పోలీసులు అనుమతించారు. కాని కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం మీదుగా మురమళ్ల భారీ వాహనాలు ప్రయాణించడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. కుండలేశ్వరం వద్ద ఏటిగట్టు 60మీటర్ల మేర కుంగిపోయిన సంగతి తెలిసిందే. ఏటిగట్టు వెంబడి భారీ వాహనాలు వెళ్లకుండా కుండలేశ్వరం వద్ద హెడ్‌వర్క్స్ జేఈ ఈశ్వరమన్యం గతంలో గడ్డర్లు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి భారీ వాహనాల కోసం గడ్డర్లు తొలగించారు. స్థానికులు దీనికి ఆందోళన వ్యక్తంచేశారు. జేఈ స్పందించి తిరిగి గడ్డర్లు ఏర్పాటు చేశారు. గడ్డర్లు తొలగించిన వారిపై కేసులు పెడతామన్నారు.

చేపల వ్యాపారులకు గొడుగుల పంపిణీ

అమలాపురంటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం నల్లవంతెన వద్ద చేపల విక్రయాలు నిర్వహిస్తున్న వారికి రాజమహేంద్రవరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన గొడుగులను దేవరపల్లి రాజేంద్రబాబు, వంగా వినోద్‌తో కలిసి వంటెద్దు వెంకన్నాయుడు గురువారం పంపిణీ చేశారు. చింతపల్లి చిన్నా, సాపే బాలరవి, రెడ్డి బాబు, పెనుమాల చిట్టిబాబు, కొండేపూడి సత్యనారాయణ, యాళ్ల శివ, నక్కా రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఎస్‌వోగా శ్రీరామచంద్రమూర్తి




కాట్రేనికోన, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండల పౌరసరఫరాల శాఖాధికారిగా టి.శ్రీరామచంద్రమూర్తి నియమితులయ్యారు. కాట్రేనికోన, ఐ.పోలవరం, ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల ఎంఎస్‌వోగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో చరిష్మా ప్రతిభ



అంబాజీపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురం కొప్పన మోహనరావు-రమాదేవి మెమోరియల్ 8వయూత్ ఈనెల8 నుంచి 11వరకు ఆధ్వర్యంలో నిర్వహించిన బాలుర, బాలికల రాష్ట్ర బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో అంబాజీపేట హైస్కూల్‌కు చెందిన నిమ్మకాయల చరిష్మాసాయిరుత్విక ప్రతిభ కనబరిచింది. ఉమ్మడి తూర్పుగోదావరి బాలికల జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. చారిష్మాకు బహుమతి అందించారు. చారిష్మా పలుసార్లు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. చారిష్మాను ఉపాధ్యాయులు, పీడీ అభినందించారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పి.గన్నవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముంగండ గ్రామదేవత శ్రీము త్యాలమ్మ అమ్మవారి ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి హోమం, కుంకుమ పూజలు, పంచామృత అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా చండీ హోమం



కాట్రేనికోన, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా స్థానిక మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ ఆధ్వర్యంలో హరివిళ్ళా కనస్ట్రక్షన్స్ అధినేత సుంకర పవిత్ర, నాగలక్ష్మి దంపతుల నిర్వహణలో హోమం జరిగింది. కార్యక్రమంలో బడేటి గణేష్, గుత్తుల శ్రీనివాస్, చెరుకు బాపిరాజు, గ్రంధి రామ్‌ప్రసాద్, ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, సుంకర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర



మామిడికుదురు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మగటపల్లి గ్రామదేవతలు ధనమ్మ, వనువులమ్మవార్ల జాతరలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా తీన్‌మార్ డప్పులు, బుట్టబొమ్మల విన్యాసాలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాల మధ్య వైభవంగా జరిగింది. గరగ నృత్య ప్రదర్శన భక్తులను గగుర్పాటుకు గురిచేసింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని జాతరను వీక్షించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానాలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముగ్గురు వాహన చోదకులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు గురువారం అమలాపురం కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికీ రూ.11వేలు చొప్పున రూ.33వేలు జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

1.65లక్షల ఎకరాలకు ఎలుకల నివారణ మందు పంపిణీ



ఎలుకల నివారణ చర్యలు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

మామిడికుదురు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 1.65లక్షల ఎకరాల్లో ఎలుకల నివారణకు మందును పంపిణీ చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి డి.బోసుబాబు తెలిపారు. గెద్దాడ గ్రామంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎలుకల నివారణకు 850కిలోల ఎలుకల మందును రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా యూరియా కొరత లేదని, 20వేల టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు త్వరగా రైతు విశిష్ట నెంబరును నమోదు చేసుకోవాలని, ఈనెంబరు నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాల ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌తో రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈనెంబరును నమోదు చేసుకోవాలన్నారు.ఈనెల20 వరకు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది నమోదు చేస్తారన్నారు. ఎలుక జీవిత చరిత్రను పి.గన్నవరం వ్యవసాయ సంచాలకులు ఎస్‌జేవీ రామ్మోహనరావు వివరించారు. డీడీ డి.వెంకటేశ్వరరావు, ఆత్మపీడీ వై.జ్యోతిర్మయి, డాట్ సైంటిస్ట్ నందకిశోర్, ఏడీఏ రాజశేఖర్, వ్యవసాయాధికారిణి బి.మృదుల, వ్యవసాయసహాయకులు కె.శ్రీహరి, ఎంపీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్టు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య కేసులో అమలాపురం పట్టణ శివారు అబ్బిరెడ్డివారి వీధి జంగంపాలేనికి చెందిన దూనబోయిన పెద్దిబాబు (31)ని అరెస్టుచేసి గురువారం కోర్టులో హాజరు పరిచినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈనెల7న స్థానిక కంసాల కాలనీకి చెందిన సరెళ్ల కవిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పట్లో కేసు నమోదుచేసిన పట్టణ పోలీసులు వివిధ కోణాల్లో కేసును దర్యాప్తు చేశారు. పెద్దిబాబుతో కొంత కాలంగా కవితకు వివాహేతర ఉంది. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న పెద్దిబాబు కొన్నిరోజులుగా కవితను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు తాళలేక కవిత బలవన్మరణానికి పాల్పడింది. పెద్దిబాబును అమలాపురం కోర్టులో హాజరుపర్చగా 14రోజులు రిమాండు విధించినట్టు సీఐ తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

అమలాపురంరూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యుత్ ఉద్యోగుల సంక్షేమార్థం కోనసీమ సర్కిల్ విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సిద్ధిల రాజబాబు ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 125మంది విద్యుత్ ఉద్యోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సాయివిశ్వాస్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గంధం విశ్వనాథ్, డాక్టర్ హిమాని, డాక్టర్ అసాద్‌ల బృందల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.విజయానంద్, కె.సత్యకిశోర్ పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.1.86 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,86,639 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన ఎం.విశ్వనాధం, చంద్రమాణిక్యం దంపతులు రూ.1,00,120 విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఆలయ సిబ్బంది అందించారు.





పసలపూడిలో పేరంటాలమ్మ కావిడి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు. పక్క చిత్రంలో పేరంటాలమ్మ అమ్మవారి పల్లకీ ఉత్సవం

ఘనంగా పేరంటాలమ్మ జాతర

రాయవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో పేరంటాలమ్మ జాతరను గురువారం ఘనంగా జరిపారు. కర్రి వంశస్తుల ఆడపడుచుగా పేరు గాంచిన అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, సారే, చీరలు, నైవేద్యాన్ని కావిడితో సమర్పించారు. తొలుత కావిళ్లతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. పల్లకీ ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకున్న పలువురు భక్తులు మొక్కులు చెల్లించారు. అమ్మవారిని దర్శించిన వారిలో సినీ దర్శకుడు కర్రి రామారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో పసలపూడి పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సరోజనీనాయుడుకి పలువురు నివాళి

మండపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండపేట సంఘం కాలనీలో వున్న ఎంపీపీ పాఠశాలలో గురువారం సరోజనీనాయుడు జయంతిని జరిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆమెకు నివాళులర్పించారు. విద్యార్థులు ఆమె స్ఫూర్తితో ముందుకుసాగాల వక్తలు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాణిక్యాంబ, ఉపాధ్యాయులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ పాఠశాలలో సరోజనీదేవి జయంతిని నిర్వహిస్తున్న విద్యార్థులు

బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కె.గంగవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు జరిగిన అండర్-16 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. జట్టుకు కెప్టెన్‌గా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల విద్యార్థి వి.తేజస్వరూప్ ప్రతిభ కనబర్చి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. గురువారం కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏ.అరుణోదయకుమార్, గ్రంథాలయ అధికారి ఎస్.చక్రధరరావు, అధ్యాపకులు ఏ.వీరన్న, వైవీవీ ప్రసాద్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ 2047 లక్ష్యమంటూ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేదే తప్ప వేరెవరికీ ప్రయోజనం లేదని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు వి.భీమశంకరం, బి.సిద్దూ విమర్శించారు. గురువారం ద్రాక్షారామలోని యానం సెంటర్ లో నిరసన ప్రదర్శన చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో అంబటి కృష్ణ, చింత రాజారెడ్డి, బి. సాయి దుర్గ, పోతుల సుధాకర్, సూరిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ-యానాం సెంటర్‌లో ప్రదర్శన జరుపుతున్న దృశ్యం



నర్సిపూడిలో రామాలయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

నర్సిపూడిలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

ఆలమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం నర్సిపూడిలో ఇటీవల పునర్నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం నుంచి హోమాలు, పూజలు ప్రారంభించారు. ఈనెల 15న విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ముందుగా హోమాలు, ప్రత్యేక పూజలను కాళ్లకూరి కాశీ శేఖర్‌బాబు అధ్వర్యంలో వేద పండితులు మొదలుపెట్టారు. ఆలయంలో ప్రతిష్ఠ చేయనున్న విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గురువారం నుంచి 15 వరకు ప్రతి రోజు హోమాలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ దునే స్వామినాయుడు కోరారు.

ఘనంగా పెద్దింట్లమ్మ అమ్మవారి వార్షికోత్సవం

రావులపాలెం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో పెద్దింట్ల అమ్మవారి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగనృత్యాలు, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా గరగ నృత్యాలు నిర్వహిస్తున్న దృశ్యం

ర్యాలి క్రీడా ప్రాంగణానికి మహర్దశ

- విద్యార్థుల ఇబ్బందులపై చొరవ చూపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది క్రీడాకారులను తయారు చేసిన క్రీడా ప్రాంగణం కొన్నేళ్ల నుంచి క్రీడలకు అనువుగా లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. ఆత్రేయపురం మండలం ర్యాలీ జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నది. దీనికితోడు విష సర్పాలు సైతం సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. చీకటిపడితే చాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలున్నాయి. క్రీడా ప్రాంగణం లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ ఇటీవల హైస్కూల్‌లో పర్యటించారు. క్రీడా ప్రాంగణం దుస్థితిని పలువురు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి ఆయన వివరించారు. సొంత ఖర్చుతో క్రీడా ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి మైదానాన్ని శుభ్రం చేసి ఎత్తుపలాలను సరిచేశారు. విద్యార్థులు చెప్పిన 24 గంటల్లోనే క్రీడలకు అనువుగా ప్రాంగణాన్ని తీర్చిదిద్దడంతో విద్యార్థులతో పాటు, క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



క్రీడలకు అనువుగా తీర్చిదిద్దిన మైదానం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాయవరం, వెంటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వెంటూరు సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ పనుల్లో భాగంగా వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో, రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ నదురుబాద ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా రాయవరం, వెదురుపాక, వి.సావరం, నదురుబాద గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ తెలిపారు.

విద్యార్థులకు ఎంవీఐ అవగాహన

మండపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండపేట ఎంవీఐ లక్ష్మీశ్రీదేవి నేతృత్వంలో మండపేట, ఆలమూరు రోడ్డులో వున్న విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని ఆమె తెలిపారు. విద్యార్థుల ప్రశ్నలకు ఎంవీఐ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శాస్త్రి, కళాశాల డైరెక్టర్ గణేష్‌చౌదరి ప్రిన్సిపాల్ బాబి, విద్యార్థులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.



స్వామివారి పుష్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా పుష్పయాగం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమరఖండ్రికలో ఖండేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆఖరిరోజు గురువారం స్వామివారి పుష్పయాగం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కొమాళ్లపల్లి శ్రీనివాసరాంగోపాల్ బ్రహ్మత్వంలో శ్రీకంఠం అమ్మన్న పంతులు ఆధ్వర్యంలో ద్వాదశ ప్రదక్షిణల అనంతరం స్వామివారి పుష్పయాగం శాస్త్రోక్తంగా జరిపారు. ఈనెల 8న ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసినట్టు ఆలయ ఈవో రాంబాబు రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



టీటీడీ పురందర అనుగ్రహప్రశస్త అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న నాయకులు

పురందర అనుగ్రహప్రశస్త అవార్డు గ్రహీతకు సత్కారం

ఆలమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో పురందర అనుగ్రహప్రశస్త అవార్డు గ్రహీత ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామిని ఆలమూరులో గురువారం సత్కరించారు. ఇటీవల ఆయన తిరుమలలో పురందర అనుగ్రహ ప్రశస్త అవార్డును అందించిన సందర్భంగా హరే శ్రీనివాసా మహిళా భక్త మండళ్ల అధ్వర్యంలో ముకుందేశ్వరస్వామికి సత్కారం ఏర్పాటు చేశారు. ముందుగా ముకుందేశ్వరస్వామి, నాగమల్లేశ్వరి దంపతులను గ్రామంలో ఊరేగింపుతో అయ్యప్పస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వేదమంత్రాల మధ్య సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బండారు సంజీవ్, వంటిపల్లి పాపారావు, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, జిల్లా నుంచి వచ్చిన హరే శ్రీనివాస మండలి సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ఘనంగా వేణుగోపాలస్వామి పుష్పయాగం

రాయవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పుష్పయాగం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో అలంకరణ జరిపి పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం శ్రీపుష్పయాగం జరిపారు. కార్యక్రమంలో ఈవో గంధం సత్యనారాయణ, దేవస్థానం సిబ్బంది పెమ్మాడి వెంకటేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 17వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం రామచంద్రపురం డీవైఈవో పి.లక్ష్మణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఒత్తిడి లేకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామచంద్రపురం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్



ఆలమూరులో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



మండపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన నేత లీలాకృష్ణ

'ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపిద్దాం'

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సకల జనుల శ్రేయస్సే లక్ష్యంగా ఎన్‌డీఏ పాలన సాగుతుందని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామచంద్రపురంలోని వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ మాట్లాడుతూ 27న జరిగే ఎన్నికల్లో రాజశేఖర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, వికాస్ విద్యా సంస్థల అధినేత వాసంశెట్టి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కార్యకర్తలకు ఎమ్మెల్యే బండారు పిలుపు

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆలమూరులో గురువారం టీడీపీ మండల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నియోజకవర్గ పరిశీలకుడు వెలమ కార్పొరేషన్ అధ్యక్షుడు గణేష్‌కుమార్ ప్రసంగించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, నాయకులు బండారు సంజీవ్, దండంగి రామారావు, వంటిపల్లి పాపారావు, రామానుజుల శేషగిరిరావు, పాలూరి సత్యానందం, కొమ్ము నారాయుడు, సాలి సత్యనారాయణ, కొత్తపల్లి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాష్ట్ర కొప్పవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీ గణేష్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు వాసిరెడ్డి రాంబాబు ప్రచారం చేశారు. ర్యాలీ జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముళ్లపూడి భాస్కరరావు, తెలుగు యువనేత ముళ్లపూడి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గణేష్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు కోరారు. గురువారం కొత్తపేటలో జరిగిన ప్రచారంలో వారు పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి జయలక్ష్మి, సంపతి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండపేట (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం కోరుతూ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ కూటమి నాయకులతో కలిసి గురువారం ఇప్పనపాడు, తాపేశ్వరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. మండపేటలో కూడా కూటమి నాయకులు పార్టీ పరిశీలకుడు ఆర్.మహేష్, స్థానిక నాయకులు రాజశేఖరం గెలుపు కోరుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

మెగా సాఫ్ట్‌వేర్ మేళాకు విశేష స్పందన

ద్రాక్షారామ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా సాఫ్ట్‌వేర్ జాబ్ మేళాకు స్పందన వచ్చింది. ఈ జాబ్‌మేళాను నిర్వాహకులు వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. జాబ్‌మేళాలో 23 ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పొందిన 1300 మందికి బ్రాంచ్‌ల వారీగా ఇంటర్వ్యూలు చేయగా, వీరిలో 225 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం మీడియాతో మాట్లాడారు. రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపాలనే లక్ష్యంతో తన కుమారుడు మంత్రి సుభాష్ ఆశయం మేరకు జాబ్‌మేళా నిర్వహించామన్నారు. 23 కంపెనీలు 225 మందిని ఎంపిక చేశారని, ఒక కంపెనీ అత్యధికంగా 16 మందిని ఎంపిక చేసి రూ. 8 లక్షల నుంచి 12 లక్షల ప్యాకేజీ ఇచ్చిందన్నారు. మిగిలిన కంపెనీలు రూ.3లక్షల నుంచి 9 లక్షల వరకు ప్యాకేజీలు ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కోవల్నెస్ డిజిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పొన్నగంటి శ్రీనివాస్, పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం



పారిశుధ్యంపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

మండపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండపేటలో పారిశుధ్యం మెరుగుకు ప్రజలంతా సహకరించాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. ప్రభుత్వం అందించిన తడి, పొడిచెత్తను డబ్బాల్లో వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. మండపేటలో గురువారం ఆయన మెయిన్ రోడ్డులో పర్యటించి వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లను వాడవద్దని చేతి సంచుల ఉపయోగించేలా వినియోగదారులకు వ్యాపారులు అవగాహన కల్పించాలన్నారు. ఆయన ప్రజలకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట సచివాలయ ఉద్యోగులు తదితరులు వున్నారు.

పాణింగపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

కె.గంగవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణింగపల్లి గ్రామ పంచాయతీ వద్ద గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సంయుక్తంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు చేశారు. ఎనిమిది మందికి కంటి ఆపరేషన్స్ గుర్తించి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లి మెరార్జీ, బలుసు నాగేంద్ర, బలుసు కృష్ణప్రసాద్, అల్లూరి కృష్ణారావు, పెందుర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం



విజయవాడలో క్రీడాప్రాధికారిక సంస్థ ఛైర్మన్ రవినాయుడును కలిసిన మండపేట క్రీడాకారులు

క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

మండపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీ క్రీడాప్రాధికారిక సంస్థ ఛైర్మన్ రవినాయుడును మండపేటకు చెందిన క్రీడాకారులు గురువారం విజయవాడలో కలిశారు. ఏపీ రాష్ట్ర టెన్నికాయిట్ అసోషియేషన్ అధ్యక్షుడు వై.డిరామారావు, జనరల్ సెక్రటరీ కెవీవీ సత్యనారాయణ, మండపేట ఇంటర్నేషనల్ టెన్నికాయిట్ క్రీడాకారుల ఛైర్మన్‌ను కలిసిన వారిలో వున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఛైర్మన్ చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో టెన్నికాయిట్ కోర్టులను ఏర్పాటు చేస్తామని క్రీడాకారులకు తెలిపారు. టెన్నికాయిట్ కోచ్ కుంచే రవిని ఛైర్మన్ రవినాయుడు అభినందించారు.



డివైడర్ ఏర్పాటు చేయాలని హైవే అధికారులను కోరుతున్న సర్పంచ్ తదితరులు

చెముడులంక వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలి

ఆలమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంక వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలని గురువారం హైవే అధికారులను సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ కోరారు. ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవోపాటు హైవే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.వీరవెంకట్రావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థికసాయం

రావులపాలెం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం ఇసుకపూడికి చెందిన నెల్లి లక్ష్మణరావు ఆరు నెలల బాలుడికి హార్టుకు సంబంధించిన సమస్య వచ్చింది. వైద్యులు సర్జరీ చేయాలని తెలపడంతో పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల కోసం రావులపాలెంలోని అక్షయ సేవా సంస్థను సాయం కోరారు. దీంతో వారు రూ.10వేలు, సభ్యులు రూ.22వేలు కలిపి రూ.32వేలను బాలుడు తండ్రికి అందించారు.